ఈనాడు వరంగల్
గురువారం అక్టోబరు 24, 2024

నకిలీ పోడు పట్టాలపై పాలనాధికారి ఆగ్రహం!

ఈనాడు కథనానికి స్పందన

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేట డివిజన్‌లోని కొన్ని గ్రామాల్లో జరిగిన అటవీ భూములకు నకిలీ అటవీ హక్కు పత్రాల(పట్టా పుస్తకాల) దందాపై జిల్లా పాలనాధికారి సత్య శారద ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి, నర్సంపేట, నల్లబెల్లి తహసీల్దార్లతో మాట్లాడి ఆరా తీశారు. ఏ గ్రామాల్లో ఈ దందా నడిచింది, దీని వెనుక అసలు సూత్రధారులెవరో తెలుసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. 'రూ.10 వేలకే ఎకరం భూమికి పోడు పట్టా!' శీర్షికన బుధవారం ఈనాడులో ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. పాలనాధికారి ఆదేశాల మేరకు నర్సంపేట, నల్లబెల్లి తహసీల్దార్లు నకిలీ పోడు పట్టా పుస్తకాల చెలామణిపై విచారణ ప్రారంభించారు. మరోవైపు నిఘా అధికారులు సైతం దీనిపై దృష్టి సారించి వివరాల సేకరిస్తున్నారు.

ఇంకా చాలా ఉన్నాయి..: ఈ ముఠా సభ్యులు అసైన్డ్, ధరణి భూముల్లోనూ అక్రమాలకు పాల్పడినట్లు తెలిసింది. ఖానాపురం మండలంలో ఒకరి అసైన్డ్ భూమికి పట్టా పుస్తకం, మరొకరికి పట్టా పాసు పుస్తకం ఉన్నప్పటికీ మరొకటి తీసుకొచ్చి పంట రుణం ఇప్పించారు. కొత్తూరు గ్రామానికి చెందిన ఓ రైతుకు ఎకరున్నర భూమి ఉండగా ధరణి పట్టా పాసు పుస్తకంలో 1.02 ఎకరమే నమోదైంది. మిగతా 18 గుంటల భూమి నమోదు చేయించుకోవడానికి ఈ ముఠా నాయకుడికి ఆగస్టులో రూ.8500తో పాటు ఒరిజినల్ ధరణి పాసు పుస్తకం, ఆధార్ కార్డును ఇచ్చాడు. అప్పటి నుంచి రేపు, మాపు అంటూ దాటవేస్తూ ఇటీవల డూప్లికేటు(నకలు) పుస్తకాన్ని ఇచ్చి మభ్య పెట్టాడు. దీతో ఆ రైతు బుధవారం ఆయన ఇంటికెళ్లి నిలదీస్తే పాసు పుస్తకం సాయంత్రం ఇస్తానని చెప్పి డూప్లికేటు పుస్తకాన్ని తీసుకున్నాడు.

'ప్రీ రిపబ్లిక్ డే' శిబిరానికి ఎంపిక

రంగంపేట: నవంబరు 12 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని జల్గాంలో జరిగే 'ప్రీ రిపబ్లిక్ డే' జాతీయసేవా పథకం(ఎన్ఎస్ఎస్) శిబిరానికి కాకతీయ విశ్వవిద్యాలయం తరఫున వరంగల్ ఎల్బీ కళాశాల డిగ్రీ విద్యార్థిని బానోతు దివ్య ఎంపికయ్యారు. బుధవారం దివ్యను ఎల్బీ కళాశాల ఛైర్మన్ భాగ్య నారాయణ, కార్యదర్శి వినయ్‌కుమార్, కోశాధికారి ఎన్ఎం. రమేశ్, ప్రిన్సిపల్ డా.అరుణ, ఎన్ఎస్ఎస్ అధికారులు రాఘవేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెర మరుగు!

● నగరంలో గత మూడేళ్లలో 12 థియేటర్ల మూత

ఒక థియేటర్ నడవడం వల్ల నగరంలో 10 మంది, గ్రామీణ ప్రాంతాల్లో అయిదుగురు ఉపాధి పొందుతారు.

జిల్లాల వారీగా మూసేసిన వివరాలు

	● ప్రస్తుతం నడుస్తున్నవి	● మూతబడినవి
త్రినగరి పరిధి	10	12
ములుగు	03	02
జనగామ	03	01

ఒకప్పుడు సినిమా విడుదల ఉందంటే థియేటర్ల వద్ద పండగ వాతావరణం ఉండేది. ప్రధానంగా దసరా, దీపావళి, సంక్రాంతి పండగల వేళ కొత్త సినిమాలతో నెలకొనే కోలాహలం అంతా ఇంతా కాదు. ఇంటిల్లిపాది సినిమా చూస్తేనే పండగకు నిండుదనం వచ్చేది. కానీ! కరోనా తర్వాత సంక్షోభంలోకి వెళ్లిన వెండితెర పూర్తిస్థాయిలో కోలుకోలేదు. వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరిలోనే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సినిమా థియేటర్లు క్రమంగా మూతబడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో గత అయిదేళ్లలో 15 థియేటర్లు మూసేశారు.


వరంగల్ నగరంలోని రామ్‌లక్ష్మణ్ టాకీస్ ఇది. పెద్ద హీరోల సినిమాలు విడుదలైనప్పుడు తెరిచి ఆ తర్వాత మూసివేస్తున్నారు


మట్టెవాడలో మూతబడిన కాకతీయ కాంప్లెక్సు

ఫంక్షన్ హాల్స్, మాల్స్‌గా..

కొన్ని టాకీస్‌లు వేడుకల మందిరంగా మారుతుండగా.. మరికొన్ని వాణిజ్య సముదాయాలుగా రూపాంతరం చెందుతున్నాయి. ప్రేక్షకులు ఇంట్లో రంగురంగుల టీవీల్లో, చరవాణుల్లో ఓటీటీల ద్వారా సినిమాలు చూస్తున్నారు. దీంతో సినిమా టాకీస్‌లపై ఆధారపడ్డ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. అమ్మలా ఆదరించిన సినీ కళామతల్లికి ఇంతటి కష్టమొస్తుందని అనుకోలేదని టాకీస్‌ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరంగల్‌లో సినిమా థియేటర్ల మూసివేత, కూల్చివేతలు గత మూడేళ్లలో ఎక్కువయ్యాయి.


వరంగల్ స్టేషన్‌రోడ్డులో థియేటర్ తొలగించి వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్న యాజమాన్యం

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ, రంగశాయిపేట

10 శాతం మందే ఆధారపడుతున్నారు

- రమేష్ తెలంగాణ ఎగ్జిబ్యూటర్ అసోసియేషన్ ఈసీ సభ్యుడు, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి




రోజురోజుకు భూముల విలువ పెరుగుతుండటంతో థియేటర్లు తొలగించి.. ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో 10 శాతం యజమానులు మాత్రమే సినిమాలపై ఆధారపడుతున్నారు. థియేటర్ల పరిస్థితి బాగాలేదు. లాభాలు లేవు. ఇప్పుడు 90 శాతం మంది లీజుకు తీసుకొని నిర్వహిస్తున్నారు. లాభాలు లేక వారి పరిస్థితీ దయనీయంగా ఉంది. సింగిల్ థియేటర్ల మనుగడ కొనసాగాలంటే కనీసం విద్యుత్తు బిల్లులపై ప్రభుత్వం రాయితీ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

40 ఏళ్లుగా పనిచేస్తున్నా..: - మహ్మద్ దస్తగిరి, సినీ కార్మికుడు



వరంగల్ అజంజాహి మిల్లు సమీపంలో 40ఏళ్ల క్రితం వెంకట్రామా టాకీస్ కట్టారు. మొదట నెలకు రూ.240 జీతానికి టికెట్ కౌంటరులో పనిచేశా. గతంలో కొత్త సినిమా విడుదల అవుతుందంటే టాకీస్ యజమానితో పాటు మాకు ఎంతో గౌరవం ఉండేది. మూడేళ్లుగా టాకీస్‌లు సరిగా నడవక, ప్రేక్షకులు సరిగా రాక థియేటర్ల యజమానులు నష్టపోతున్నారు. థియేటర్లకు మళ్లీ పూర్వ వైభవం రావాలని కోరుకుంటున్నా. ప్రస్తుతం నెలకు రూ.8 వేల జీతానికి థియేటర్ కాపలాదారుగా పనిచేస్తున్నా.

రాబడి లేదు..: - గండె నవీన్, హీరో మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు కొత్త సినిమాలు విడుదల అయ్యే రోజు అభిమానులుగా మాకు పండగే. సినిమా విడుదలకు ముందు రోజు థియేటర్లను పెళ్లి మండపంలా ముస్తాబు చేసేవాళ్లం. ఇప్పుడు కొత్త సినిమాలు వస్తున్నా.. గతంలో ఉన్నంత ఆనందం కలగట్లేదు. నాడు ఒక సినిమా విడుదలైతే వంద రోజులు, సంవత్సరం పాటు నడిచేవి. ప్రస్తుతం ఒకేరోజు ఎక్కువ ఆటలు ఆడిస్తున్నారు. అయినా థియేటర్ల యాజమాన్యానికి రాబడి లేదు.

మంత్రి ఆదేశాలు.. అధికారుల సమీక్ష


ఎంజీఎం సూపరింటెండెంట్ డా.చిలుక మురళితో సమావేశమైన ఇంజనీరింగ్ అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రితో పాటు కాకతీయ వైద్య కళాశాల(కేఎంసీ)లోని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, వైద్య కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు. ఈ నెల 22న హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్ష నిర్వహించారు. ఈక్రమంలో ఎంజీఎం, కేఎంసీ ఆసుపత్రుల్లోని సమస్యల ప్రస్తావన వచ్చింది. సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయడానికి కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తామని మంత్రి అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం ఎంజీఎం ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డా.చిలుక మురళి అధ్యక్షతన కేఎంసీ ప్రిన్సిపల్ డా.రాంకుమార్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వైద్యసేవలు, మౌలిక సదుపాయాల సంస్థ చీఫ్ ఇంజినీర్ దేవేంద్రకుమార్, ఈఈ ప్రసాద్, డీఈ రాజశేఖర్, ఏఈలు, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ సమావేశమయ్యారు. అనంతరం ఎంజీఎం, కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో సమస్యాత్మకంగా ఉన్న వార్డులు పరిశీలించి చేపట్టాల్సిన మరమ్మతుల వివరాలను నమోదు చేసుకున్నారు. అవసరమైన సామగ్రి పనులు, సిబ్బంది భర్తీకి ప్రతిపాదనలు తయారు చేయాలని నిర్ణయించారు. అనంతరం ఎంజీఎం సూపరింటెండెంట్ డా.మురళి ఆధ్వర్యంలో అధికారులు జిల్లా కలెక్టర్ డా.సత్యశారదను కలిశారు. సమావేశంలో చర్చించిన అంశాలతోపాటు పరిశీలనలో గుర్తించి, ప్రతిపాదించిన సమస్యలను ఆమెకు వివరించారు.

పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: తెలంగాణ పారామెడికల్ బోర్డు ఉత్తర్వుల మేరకు కాకతీయ వైద్య కళాశాలలో వివిధ పారామెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైనవారు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కేఎంసీ ప్రిన్సిపల్ డా. రాంకుమార్‌రెడ్డి తెలిపారు. డిప్లొమా ల్యాబ్ టెక్నీషియన్, అనస్తీషియా, కార్డియోలజీ, డార్క్‌రూం అసిస్టెంట్, డయాలసిస్, మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ, డెంటల్ అసిస్టెంట్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. పూర్తి వివరాల కోసం www.tgpmb.telangana.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

స్మార్ట్ సిటీలో అధ్వాన రోడ్లు!


పోతననగర్ ప్రధాన రహదారి దుస్థితి


రామన్నపేట మలుపు వద్ద ఇలా..

వరంగల్ స్మార్ట్‌సిటీగా పేరుగాంచింది. కానీ! నగరంలోని ప్రధాన రహదారులు మాత్రం అధ్వానంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా గుంతలు.. కంకరే కనిపిస్తోంది. వరంగల్ పోతన నగర్ ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. మణిద్వీప గార్డెన్ నుంచి రామన్నపేట రోడ్ మలుపు వరకు 100-150 మీటర్లు బీటీ రోడ్డు పాడైంది. వర్షాలకు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రెండు నెలలవుతున్నా ఆర్అండ్‌బీశాఖ అధికారులు స్పందించడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' ఆర్అండ్‌బీ శాఖ వరంగల్ డీఈఈ దేవిక దృష్టికి తీసుకెళ్లగా.. క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారి బాగు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, రామన్నపేట

తాగునీరు మాయం.. ప్రజలపై భారం

● నగరంలో రోజుకు 30 ఎంఎల్‌డీల నీటివృథా

నగరంలో కొన్నికాలనీలకు కాలమేదైనా తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. మరోవైపు పైపులైన్ లీకేజీలకు అడ్డుకట్ట పడటం లేదు. నగరానికి సరఫడా నీరు శుద్ధి చేస్తున్నట్లు లెక్కలు కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందడం లేదు. నీటివృథాను అరికడతేనే నగర ప్రజలకు తాగునీటి తిప్పలు తీరనున్నాయి.

– కార్పొరేషన్, న్యూస్‌టుడే


ఇటీవల ఖమ్మంరోడ్డు పెట్రోల్‌పంపు ఎదుట పైపులైన్ లీకేజీ

నగరంలో ప్రతిరోజూ 201 మిలియన్ లీటర్ పర్ డే(ఎంఎల్‌డీలు) క్లియర్ వాటర్ వదులుతున్నారు. ఇందులో 15 శాతం దాదాపు 30 ఎంఎల్‌డీల నీరు వృథా అవుతోంది. ఈ నీటిని 5-6 డివిజన్లలో సుమారు 60-70 వేల మందికి అందించవచ్చునని గ్రేటర్ వరంగల్ ఇంజినీరింగ్ విభాగం లెక్కలు చెబుతున్నాయి. అందులో 20 ఎంఎల్‌డీల నీరు లీకేజీల ద్వారా, 10 ఎంఎల్‌డీలు అక్రమ కుళాయి కనెక్షన్ల ద్వారా మాయం అవుతున్నట్లు ఓ ప్రైవేటు సంస్థ నిర్వహించిన సర్వేలో తేలింది. 30 ఎంఎల్‌డీల తాగునీటిని శుద్ధి చేయాలంటే రోజూ రూ.5-6 లక్షల ఖర్చవుతోంది. దీనివల్ల ప్రజాధనం వృథాతో పాటు వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పలు కాలనీల్లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. సుమారు 40 కాలనీలకు అద్దె వాటర్ ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు.

1000 పైనే లీకేజీలు

వరంగల్, హనుమకొండ, కాజీపేట త్రినగరాలతో పాటు 42 విలీన గ్రామాల్లో సుమారు 1000 పైనే లీకేజీలు ఉంటాయని తెలిసింది. కొత్తగా వేసిన మిషన్ భగీరథ సరఫరా(డిస్ట్రిబ్యూషన్) పైపులైన్ల ద్వారా ఎక్కువగా లీకేజీలు ఏర్పడినట్లు తేలింది. అమృత్, అర్బన్ మిషన్ భగీరథ పనులు పూర్తయ్యాయని, లీకేజీలతో మాకు సంబంధం లేదని మున్సిపల్ పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులంటున్నారు. భగీరథ పైపులైను లీకేజీలు వాళ్లే చేయాలని బల్దియా ఇంజినీర్లు చెబుతున్నారు. రెండుశాఖల సమన్వయలోపంతో చాలా డివిజన్లలో లీకేజీ పనులు చేపట్టడం లేదని కార్పొరేటర్లు అంటున్నారు.

కలుషిత ముప్పు

లీకేజీలతో నగరంలోని పలు కాలనీలకు కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. హనుమకొండ నయీంనగర్, కొత్తూరు జెండా, వరంగల్ రామన్నపేట, పోతన రోడ్, ఓ.ఎస్.నగర్, పాపయ్యపేట, జేపీఎన్ రోడ్, బొందలకుంట, మట్టెవాడ తదితర కాలనీల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి.

స్వచ్ఛమైన నీటి సరఫరా లక్ష్యం

- గుండు సుధారాణి, మేయర్

వరంగల్ నగర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేయడం గ్రేటర్ వరంగల్ లక్ష్యం. లీకేజీలు అరికట్టడం, ఇతర సమస్యల పరిష్కారానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద, వేదికపై అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీవో నీరజ, డీఏవో అనురాధ

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. బుధవారం హనుమకొండలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) సమావేశ మందిరంలో జిల్లా సహకార అధికారి నీరజ ఆధ్వర్యంలో జిల్లా కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జులు, సహకార శాఖ అధికారులు, ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి నష్టపోకుండా ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. వరి ధాన్యానికి మొదటి సారి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తే బోనస్ వచ్చే అవకాశం ఉండదన్నారు. కొనుగోలు కేంద్రాలలో సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని వేరువేరుగా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 17 శాతం లోబడి తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని ఉద్యోగులకు సూచించారు. అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి మాట్లాడుతూ నిబంధనల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి అనురాధ, డీఎస్‌వో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పరిశీలించి.. సవరణ చేయండి


భువన్ యాప్ పనితీరును కమిషనర్‌కు వివరిస్తున్న అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: భువన్ యాప్‌లో 40 వేల అర్జీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆస్తి పన్ను సవరణలు చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ డా.అశ్విని తానాజీ తెలిపారు. బుధవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో భువన్ యాప్, ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) దరఖాస్తుల పరిశీలనలో తాజా పురోగతిపై కమిషనర్ సమీక్షించారు. ప్రతి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) రోజూ 150 దరఖాస్తులు పరిశీలించి భువన్ యాప్‌లో నమోదు చేయాలని, నిర్ణీత గడువులోపు ప్రక్రియ పూర్తవ్వాలని కమిషనర్ ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్థలాల పరిశీలన మరింత వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఉప కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండకు అండగా ఉంటాం



మైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి సురేఖ

గీసుకొండ, న్యూస్‌టుడే: తమకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించిన గీసుకొండ మండల ప్రజలను ఏనాడూ మరచిపోమని మండల అభివృద్ధికి తమవంతుగా కృషి చేసి రుణం తీర్చుకుంటామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు జన్మదినంను పురస్కరించుకుని బుధవారం మండలంలోని కోటగండి వద్ద కోట మైసమ్మ, కొండగిరి సాయిబాబా దేవాలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ నాయకులు రడం భరత్ ఆధ్వర్యంలో కొమ్మాల బస్టాండు వద్ద, బొడ్డు అనిల్ ఆధ్వర్యంలో గొర్రెకుంట వద్ద ఏర్పాటు చేసిన మురళీధర్‌రావు జన్మదిన వేడుకల్లో పాల్గొని కేకు కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నాయకులు బొల్లం శివ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. కొండా జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గీయులు పాల్గొనకపోవడం విశేషం.

కరీమాబాద్: దీపావళి పర్వదినం సందర్భంగా ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో నిర్వహించే నరకాసుర వధ ఉత్సవాలను ప్రజలు వీక్షించడానికి అన్నివిధాలా ఏర్పాట్లు చేస్తామని, సౌకర్యాలు కల్పిస్తానని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బుధవారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మంత్రి సురేఖను కలిసి ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని వినతిపత్రం అందించారు.

క్రమశిక్షణ.. లాఠీ తప్పుతోంది!

తాజాగా ఒంటరిగా ఉన్న బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్‌పై కాజీపేట ఠాణాలో పోక్సో కేసు నమోదు కావడం సంచలనం సృష్టించింది.



స్నేహపూర్వక పోలీస్ వ్యవస్థ అని చెబుతూ కొందరు పోలీసులు గాడి తప్పి వ్యవహరిస్తున్న తీరు ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన చోట కొంతమంది హద్దులు మీరి ప్రవర్తిస్తున్నారు. వీరితో మొత్తం పోలీసు శాఖకు చెడ్డ పేరు వస్తోంది. అవినీతి, అక్రమ వసూళ్లు నుంచి మహిళలు, చిన్నారులపై అత్యాచారాల వరకు అధికారులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ఠాణాల్లో పోలీసు అధికారులపైనే కేసులు నమోదు కావడం చర్చనీయాంశమైంది.

– న్యూస్‌టుడే, వరంగల్‌క్రైం

ఫిర్యాదు చేసేందుకు భయం

పోలీసుశాఖలో వరుస ఘటనలు వెలుగు చూస్తుండడంతో సామాన్యులు ఠాణాలకు వచ్చి ఫిర్యాదులు చేసేందుకు భయపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

అక్రమ కేసులు, ఇతర వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న పోలీసు అధికారులపై తాత్కాలికంగా చర్యలు తీసుకుంటున్నా కొద్ది రోజుల తర్వాత రాజకీయ నాయకుల అండదండలతో బయటకు వస్తున్నారు. వారి సిఫార్సు లేఖలతో కీలకమైన విభాగాల్లో పోస్టింగ్‌లు పొందుతున్నారు. తర్వాత కేసు విచారణ సమయంలో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఆరోపణలను రద్దు చేయించుకుంటున్నారు.

రాజకీయ జోక్యం తగ్గాలి

పోలీసు శాఖ పోస్టింగ్‌ల్లో రాజకీయ జోక్యం తగ్గితే చాలా వరకు మార్పులు వస్తాయి. ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌లు ఇస్తే కొంత వరకు ప్రజలకు మేలు జరుగుతుంది.

ఈ ఎడాది వరుస ఘటనలు..

- కేయూ ఠాణాలో పనిచేసిన ఎస్సై అనిల్ మరో ప్రభుత్వశాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని వేధించాడు. మహిళ భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.
- జయశంకర్‌భూపాల్‌పల్లి జిల్లాలో పని చేస్తున్న సీఐ సంపత్ కేయూ ఠాణా పరిధిలో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆమె కూతురుపైనా అత్యాచారం చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.
- పోలీసు శాఖలోని ఇతర విభాగంలో పనిచేస్తున్న సీఐ చింతగట్టు సమీపంలో అతిథి గృహంలో మహిళతో ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లేసరికి మహిళను తప్పించాడు. అనంతరం పోలీసులు దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.
- గత ఏడాది పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్, మహిళ ఎస్సైతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేసిన అధికారులు ఇన్‌స్పెక్టర్, ఎస్సై ఇద్దరిని సస్పెండ్ చేశారు.

ఎస్సైల బదిలీలు

వరంగల్‌క్రైం: కమిషనరేట్‌లోని వివిధ ఠాణాల్లో పనిచేస్తున్న ఎస్సైలను బదిలీచేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఠాణా ఎస్సైలు ఎ. ప్రవీణ్‌కుమార్, ఎం.రాజేందర్, తరిగొప్పుల ఠాణా ఎస్సై ఎ.శ్వేతను కమిషనరేట్‌లోని సీసీఆర్‌బీకి బదిలీ చేశారు.



ప్రగతి చక్రం.. పర్యావరణ హితం

● హనుమకొండకు చేరుకున్న ఎలక్ట్రికల్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే



ప్రజా రవాణా వ్యవస్థ అనగానే ముందుగా అందరికీ గుర్తుకొచ్చేది ఆర్టీసీ. బస్సులు నిత్యం లక్షల కిలోమీటర్లు తిరుగుతూ వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఆధునిక వసతులతో మరింత సౌకర్యవంతమైన ప్రయాణ సదుపాయం కల్పిస్తూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల ఆదరణ పొందుతోంది. ఇప్పటికే రాజధాని, గరుడ లాంటి ఏసీ బస్సులు, లహరి వంటి స్లీపర్ క్లాస్ బస్సులను ప్రవేశపెట్టింది. తాజాగా మరో అడుగు ముందుకేసి ఇంధన భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణాన్ని రక్షించాలనే ఉద్దేశంతో ఎలక్ట్రికల్ బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది.

'బస్సుల నిర్వహణ బాధ్యత జేబీఎం సంస్థకు అప్పజెప్పారు. వీటిని నడిపేందుకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన డ్రైవర్లు అవసరం ఉండటంతో ఆ సంస్థనే నియామకాలు చేపట్టనుంది. ఆర్టీసీ.. కండక్టర్ల పర్యవేక్షణ బాధ్యతలు చూసుకుంటుంది. ఇవి అద్దె ప్రాతిపదికన నడుస్తాయి.'

మహాలక్ష్మి వర్తిస్తుంది..
ఎలక్ట్రికల్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ మహాలక్ష్మి పథకం, ఇతర అన్ని రకాల రాయితీలు వర్తిస్తాయి. సాధారణ ఛార్జీలే ఉంటాయి..

మూడు రకాలుగా..

- పర్యావరణ హితంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రికల్ బస్సుల్లో వరంగల్ రీజియన్‌కు 84 కేటాయించారు.
- డీలక్స్, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ మూడు రకాలు ఉంటాయి. వీటిని హైదరాబాద్ - వరంగల్, వరంగల్-కరీంనగర్ రూట్‌లో నడపనున్నారు.
- రీజియన్‌కు బుధవారం రాత్రి వరకు నాలుగు డీలక్స్, ఒకటి సూపర్ లగ్జరీ మొత్తం 5 బస్సులు చేరుకున్నాయి.
- సూపర్ లగ్జరీలో డ్రైవర్ సీటుతో కలిపి 42, డీలక్స్ బస్సుల్లో 45, ఎక్స్‌ప్రెస్‌లో 55 సీట్లు ఉంటాయి. వీటికి ఛార్జింగ్ అవసరం ఉన్నందున డిపోలో 12 ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు.

ఎలక్ట్రికల్ బస్సులకు గేర్లు ఉండవు

\- చొల్లేటి కిరణ్, ఆర్టీసీ సీనియర్ డ్రైవర్, వరంగల్ 2 డిపో



మామూలు ఆర్టీసీ బస్సులకు గేర్లు ఉంటాయి. ఎలక్ట్రికల్ బస్సులకు ఉండవు. ఎక్కువ స్పీడ్ వెళ్లకుండా లాక్ చేస్తారు. సిటింగ్, ఇతర మొత్తం మామూలు బస్సుల లాగే ఉంటాయి. శబ్ద కాలుష్యం ఉండదు. వైబ్రేషన్ ఉండదు. అద్దె ప్రాతిపదికన కాకుండా ఆర్టీసీ సొంతంగా ఈ బసులను నిర్వహిస్తే మరింత ఉపయోగకరంగా ఉండేది. దీంతో పాటు ఆర్టీసీ డ్రైవర్లుగా కొంత మందికి ఉపాధి దొరుకుతుంది.

ఇవీ ప్రత్యేకతలు..



- 1.45 గంటలు ఛార్జింగ్ చేస్తే 350 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తాయి.
- ప్రయాణికులకు అత్యవసరమైతే బస్సును ఆపేందుకు ప్రతి సీటుపై ఎస్‌ఓఎస్ మీట పెట్టారు.
- బస్సుకు మొత్తం 5 సీసీ కెమెరాలు అమర్చారు. డ్రైవర్ సీటు ముందు భాగంలో కెమెరా మానిటరింగ్ చేసే విధానం ఏర్పాటు చేశారు.
- ప్రతి సీటు వద్ద చరవాణి ఛార్జింగ్ పాయింట్ ఇచ్చారు.
- డ్రైవర్ మాట్లాడితే ప్రయాణికులకు వినపడేలా మైక్ సిస్టం ఏర్పాటు చేశారు.
- ఈ బస్సులకు ఇంటెలిజెన్స్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం అందుబాటులో ఉంది. దీని ద్వారా బస్సు ఎక్కడ ఉందో జీపీఎస్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు.
- డోర్ తెరిచి ఉంటే బస్సు స్టార్ట్ కాదు. దీనికి గేర్ సిస్టం ఉండదు. కేవలం ఎక్స్‌లేటర్ మాత్రమే ఉంటుంది. గంటకు 80 కిలోమీటర్ల వేగానికి మించి పోకుండా స్పీడ్ లాక్ చేశారు.
- జీపీఎస్‌తో అనుసంధానమై ఉండటంతో ప్రయాణికులు గమ్యం యాప్ ద్వారా ఈ బస్సు ఎక్కడ ఉంది, ఎక్కడి వరకు వచ్చింది, గమ్యస్థానం చేరుకోవడానికి ఇంకా ఎంత సమయం పడుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు.
- అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంటే ముందుగానే పసిగట్టి అలారం మోగే విధంగా సాంకేతికతను ఉపయోగించారు. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందేలా ఏర్పాటు చేశారు.



ఇటీవల కటాక్షపూర్ లో లెవెల్ కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరద..

ఎట్టకేలకు లభించిన కటాక్షం

● వంతెన నిర్మాణానికి మార్గం సుగమం..

ఎన్నో ఏళ్ల కల.. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కటాక్షపూర్ వంతెన నిర్మాణం.. ఎట్టకేలకు నెరవేరబోతోంది. ఈ వంతెనతోపాటు మరో చోట మూల మలుపును నేరుగా చేసేందుకు అవసరమైన భూ సేకరణ జరిపేలా బుధవారం కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. భూ సేకరణ పూర్తయితే వంతెన పనులు చేపట్టనున్నారు.

పరకాల, న్యూస్‌టుడే

అత్యంత కీలకం..

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్-భూపాలపట్నం 163 జాతీయ రహదారిలో కటాక్షపూర్ వంతెన నిర్మాణం అత్యంత కీలకం. కటాక్షపూర్ చెరువు వద్ద శిథిలావస్థకు చేరిన లో లెవెల్ కాజ్‌వేతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలంలో చెరువు మత్తడి పడి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు పర్యాటక ప్రదేశాలైన లక్నవరం, రామప్ప, బొగత జలపాతం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడం వల్ల అన్ని ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉద్ధృతి ఉంటే పూర్తిగా రాకపోకలు స్తంభించిపోతాయి.

భూసేకరణే ఆలస్యం..

కటాక్షపూర్ లెవెల్ కాజ్‌వే చోట వంతెన నిర్మించడానికి ఏడాదిన్నర కిందట రూ.312 కోట్లను విడుదల చేయగా టెండర్ ప్రక్రియ కూడా ముగిసింది. వంతెనను వెడల్పుగా నిర్మించడానికి హౌజ్‌బుజుర్గు, కటాక్షపూర్ గ్రామాల మధ్య కొంతమేర భూ సేకరణ అవసరం. అదే సమయంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపును నేరుగా చేయడానికి సైతం అదనపు భూమి కావాలి. ఈ రెండు చోట్ల అవసరమైన భూ సేకరణకు అనుమతి ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ(జాతీయ రహదారి) అధికారులు నెల రోజుల కిందట కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు బుధవారం భూ సేకరణకు కేంద్ర రహదారి, రవాణా శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ బాధ్యతలను పరకాల ఆర్డీవోకు అప్పగించారు.. భూ సేకరణకు సర్వే చేసి బాధిత రైతులకు పరిహారం ఇచ్చిన వెంటనే వంతెనతోపాటు మూలమలుపును నేరుగా చేసే పనులు ప్రారంభం కానున్నాయి.

జులై వరకు గడువు..

163వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మధ్యలో నుంచి ఎటూ 50 ఫీట్లతో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులను హనుమకొండ, ములుగు జిల్లాలో కలిపి మొత్తం 36 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. ఇందులో హనుమకొండ జిల్లాలో 20 కిలోమీటర్లు, ములుగు జిల్లాలో 10 కిలోమీటర్ల వరకు పనులు చేయాలి. వీటికోసం రూ.208 కోట్లను విడుదల చేయగా 2022లో పనులను చేపట్టారు. వచ్చే ఏడాది జులై వరకు ఆ పనులను పూర్తి చేయడానికి గడువు.

● దీనిపై పరకాల ఆర్డీవో కె.నారాయణ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలకు ఇంకా తమకు రాలేదన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన శాతవాహన

వందేభారత్ సహా పలు రైళ్లు ఆలస్యం

డోర్నకల్, న్యూస్‌టుడే: విజయవాడ- సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ (12713) బుధవారం మహబూబాబాద్ రైల్వేస్టేషన్ దాటాక కిలోమీటరు దూరంలో సాంకేతిక లోపంతో నిలిచింది. రైలింజన్ మీదుండే ప్యాంటో మొరాయించిందా? లేదా ఓవర్ హెడ్ ఎలక్ట్రిఫికేషన్‌లో సమస్య తలెత్తిందా అన్నది రైల్వే అధికారులే ఒక అంచనాకు రాలేకపోయారు. తర్వాత లోపాన్ని సరిదిద్ది రైలును నడిపారు. శాతవాహనకు ఉదయం 9.02 నుంచి 9.39 గంటల వరకు 37 నిమిషాలపాటు అంతరాయం కలగడంతో ఇతర రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గుండ్రాతిమడుగు దాటాక నిలిచిన ఒక గూడ్స్ రైలు మొరాయించడంతో మహబూబాబాద్ నుంచి మరో ఇంజిన్ పంపించి తీసుకొచ్చారు. ఈలోగా గుండ్రాతిమడుగు స్టేషన్‌లో విశాఖపట్నం- ముంబయి ఎల్‌టీటీ సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్(18519) రైలు గంట, డోర్నకల్‌లో గుంటూరు- సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201) గంట 10 నిమిషాలు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్(20833) ఎక్స్‌ప్రెస్ పాపటపల్లి రైల్వేస్టేషన్‌లో గంటకు పైగా నిలిచాయి.

పట్టణాభివృద్ధికి శ్రీకారం!

● ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు

పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో ప్రణాళిక బద్ధమైన విస్తరణ, అభివృద్ధి, నాణ్యమైన పట్టణవాసం కల్పించడమే లక్ష్యంగా జిల్లాకో పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ- యూడీఏ)లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. గతంలో ఉన్న పట్టణాభివృద్ధి సంస్థలను అవసరమైన చోట విస్తరించాలని, ఇందుకు అవకాశాలు లేని చోట కొత్తవి ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో కొత్తగా 18 సంస్థలను ఏర్పాటు చేయనుంది. – జనగామ, న్యూస్‌టుడే

'ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటికే వరంగల్, హనుమకొండ జిల్లాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి.'

'ఏజెన్సీ ప్రాంతం అత్యధికంగా ఉన్న జిల్లాలను ఈ ప్రక్రియ నుంచి మినహాయించారు. దీంతో ములుగు జిల్లాకు ఈ అవకాశం లేదు. మహబూబాబాద్, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లో పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి..'


యూడీఏ	వైశాల్యం (చ.కి.మీ),	జనాభా–2011	జనాభా(2024) అంచనా	పురపాలికలు /గ్రామాలు
జనగామ(జుడా)	1654.756	403516	454168	1/225
భూపాలపల్లి(బుడా)	2293	416763	462249	1/242
మహబూబాబాద్(ముడా)	1891.75	600101	654961	4/163

ప్రత్యేక కమిటీ ఆధ్వర్యంలో..

జిల్లా కలెక్టర్ అధ్యక్షతన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కన్వీనర్‌గా, జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), జిల్లా గ్రామీణ, పట్టణ ప్రణాళిక అధికారి(డీటీసీపీవో), ఆర్డీవోలు, పురపాలక కమిషనర్లు, సర్వే లాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. వీరు జిల్లా కేంద్రంతో పాటు పట్టణీకరణ ప్రభావం, విస్తరణకు అవకాశాలున్న గ్రామాలు, 2011 జనాభా, ప్రస్తుత అంచనా జనాభా, ఏరియా తదితర వివరాలతో నక్షా(ప్లాన్) తదితర వివరాలతో ప్రతిపాదనను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వానికి పంపించారు.

జనగామ పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (జుడా)

'జనగామ మున్సిపల్ సహా 226 గ్రామాలను జుడా పరిధిలో చేర్చాలని ప్రతిపాదించారు.'



2017లో 10 మండలాలతో జనగామ పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ప్రస్తుతం జిల్లా పరిధిలో 12 మండలాలుండగా, జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలు 'కుడా' పరిధిలో ఉన్నాయి. వాటిలో మార్పు లేదు. 283 గ్రామాలకు గాను.. ఈ జిల్లా సూర్యాపేట, భువనగిరి యాదాద్రి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది.



● విద్య, వైద్యం, వ్యాపార రంగాల్లో అభివృద్ధి చెందుతున్న క్రమంలో రైలు, రోడ్డు, భూముల క్రయవిక్రయాలకు అనువుగా ఉన్న కారణంతో జుడా పరిధిలోకి తేవాలని ప్రతిపాదించారు.

భూపాలపల్లి (బుడా)

'భూపాలపల్లి పురపాలిక సహా 242 గ్రామాలతో 'బుడా' ఏర్పాటుకు ప్రతిపాదించారు.'




కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలోని ప్రాంతాలను పునర్వ్యవస్థీకరించి భూపాలపల్లి జిల్లాను ఏర్పాటు చేశారు. ఆరు జిల్లాలు, రెండు రాష్ట్రాలతో సరిహద్దు బంధం కలిగి ఉంది. ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాలు, సింగరేణి, కేటీపీపీ వంటి పరిశ్రమలు, కాళేశ్వరం ప్రాజెక్టు కేంద్రంగా ఉంది.

● ఎన్‌హెచ్ 353సి, ఎన్‌హెచ్ 163జితో అనుసంధానమై వ్యాపార, వాణిజ్య, వ్యవసాయ, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి అవకాశం ఉన్నందున పట్టణీకరణకు విస్తార అవకాశాలున్నందున జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ అవసరమని ప్రతిపాదించారు.

మహబూబాబాద్ (ముడా)

ఎన్‌హెచ్ 365 పరిధిలోని మహబూబాబాద్ ఏడు జిల్లాలతో సరిహద్దు కలిగి ఉంది. ఎన్‌హెచ్ 563, ఎన్‌హెచ్ 930పి, ఎన్‌హెచ్ 163జిలతో అనుబంధాన్ని కలిగి ఉంది. సికింద్రాబాద్-విజయవాడ మధ్య రైలు సౌకర్యంతో ఉన్న జిల్లాలో భవిష్యత్తులో వ్యాపార, వాణిజ్య ఇతర రంగాల అభివృద్ధికి అన్ని అవకాశాలున్నందున ముడా ఏర్పాటుకు ప్రతిపాదించారు.

'మహబూబాబాద్, డోర్నకల్, తొర్రూరు, మరిపెడ(4) పురపాలికలు, 163 రెవెన్యూ గ్రామాలతో ముడాను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.'



కొనుగోలుదారుల ఆదరణ పొందాలి



రిబ్బన్ కత్తిరించి షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మాధవరెడ్డి

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : నాణ్యమైన వస్త్రాలతో కొనుగోలుదారుల ఆదరణ పొందాలని వరంగల్ పశ్చిమ, నర్సంపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి అన్నారు. హనుమకొండ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను బుధవారం వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఏ వ్యాపారానికైనా కొనుగోలుదారుల నమ్మకమే ముఖ్యమన్నారు. ప్రముఖ వస్త్ర వ్యాపారి కాసం నమఃశివాయ మొదటి కొనుగోలుదారుగా దుస్తులు కొన్నారు. షోరూం జీఎం సశింద్రన్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇదే పెద్ద షోరూం అన్నారు. దక్షిణ భారతంలో రామ్‌రాజ్ షోరూంలు అత్యంత ప్రజాదరణ పొందాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 క్రికెట్ విజేత హనుమకొండ జట్టు



జట్టు సభ్యులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-23 క్రికెట్ పోటీల్లో హనుమకొండ జట్టు విజేతగా నిలిచింది. హనుమకొండలోని రెడ్డిపురంలో ఉన్న టీవీవీ సుఖాంత్ క్రీడా మైదానంలో ఈ నెల 20 నుంచి 23 వరకు వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న హనుమకొండ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. ఛేదనకు దిగిన మహబూబాబాద్ జట్టు 16 ఓవర్లలో 64 పరుగులకే కుప్పకూలింది. విజేత హనుమకొండ, రన్నరప్‌గా నిలిచిన మహబూబాబాద్ జట్లకు అతిథులు ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు ఉపేందర్, రాము, మట్టెడ కుమార్, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజేతలతో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, అతిథులు

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో నిర్వహించిన అండర్-15 విభాగం పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు, ధ్రువపత్రాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదరంగం పోటీలకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌ను ఉచితంగా వినియోగించుకోవచ్చన్నారు. విజేతలు నవంబరు 3 నుంచి 11 వరకు తమిళనాడులో జరిగే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా తెలిపారు. చీఫ్ ఆర్బిటర్ సాయిప్రసాద్, ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.

విజేతలు: బాలుర విభాగంలో యోహాన్ యాదవ్, ప్రణయ్, అంజనికుమార్, సాహర్ష, బాలికల విభాగంలో యాశ్విజైన్, శరణ్య, సహర్ష, శ్రీలాస్య తొలి నాలుగు స్థానాల్లో నిలిచారు.

మూసీ పునరుద్ధరణలో నిర్వాసితులకు న్యాయం చేయాలి



రహదారి పనులు పరిశీలిస్తున్న సీపీఐ కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు, నాయకులు

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో మూసీ నది పునరుద్ధరణ, హైడ్రాలో ఇళ్లు కోల్పోయిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పార్టీ సమావేశానికి హాజరై ఖమ్మం వెళ్తూ.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లిలో పార్టీ నాయకులతో కలిసి ఎల్కతుర్తి - సిద్దిపేట జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయ రహదారి పనులు నాసిరకంగా సాగుతున్నాయని, దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆచార్య సాయిబాబు మృతి కేంద్ర ప్రభుత్వ హత్యగా అభివర్ణించారు. ఇటీవల హరియాణాలో జరిగిన ఎన్నికల్లో భాజపాది నిజమైన విజయం కాదని, కాంగ్రెస్ వైఫల్యంతో అధిక సీట్లు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గడువులోపు హామీలను అమలు చేయకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు
(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టత అవసరం



కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేటలో నిర్మిస్తామంటున్న కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. బుధవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కాజీపేట రైల్వే జంక్షన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, అయోధ్యపురంలో వ్యాగన్ తయారీ కేంద్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జీఎంతో జరిగే సమావేశంలో ప్రస్తావిస్తానని, తర్వాత రైల్వే శాఖ మంత్రిని కలుస్తానని చెప్పారు. జిల్లా వాసుల చిరకాల స్వప్నం కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ సాధనకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాజీపేట - బల్లార్షా మార్గంలో నాలుగు లైన్ల నిర్మాణం పూర్తికావడంతో కాజీపేట మీదుగా మరిన్ని రైళ్లు తిరిగే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా ప్లాటుఫారాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కాజీపేట స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, విశ్రాంత గదుల నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాజీపేటలో బస్టాండ్ లేక పోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రైల్వే స్థలం ఇస్తే బస్టాండ్ నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం రైల్వే ఆసుపత్రిని సందర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ సీఈ లక్ష్మీనారాయణ, సీనియర్ డీఈఎన్ వెంకట్, సీడీఎం అనికేత్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయశ్రీ పాల్గొన్నారు.

ఐఎంఏ హాలులో రక్తదాన శిబిరం



రక్తదాత మట్టెవాడ సీఐ గోపీకి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డీసీపీ సలీమా, ఏసీపీ నందిరాంనాయక్

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకొని వరంగల్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా ప్రారంభించారు. ఈ సందర్భంగా మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్, మిల్స్‌కాలనీ పోలీసు స్టేషన్ల పరిధిలోని యువకులతో పాటు పోలీసు అధికారులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలకు డీసీపీ సలీమా ధ్రువీకరణ పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్లు గోపీ, షుకూర్, వెంకటరత్నం, ఐఎంఏ అధ్యక్షుడు డా.అన్వర్, ఎంజీఎం రక్తనిధి కేంద్రం ఇన్‌ఛార్జి మేరీ, ఎన్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి చేయండి



ఖిలావరంగల్ క్రీడా మైదానంలో సభ్యత్వం నమోదు చేయిస్తున్న రవికుమార్, భాజపా నాయకులు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం 36, 37, 38 డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఖిలావరంగల్ క్రీడా మైదానంలో చేపట్టిన సభ్యత్వం నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వాకర్స్, క్రీడాకారులతో సభ్యత్వం చేయించారు. నాయకులు కుసుమ సతీష్, హరిశంకర్, వెంకటేష్, జనార్దన్, అరుణ్, రాజు, మధుకుమార్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వర్ధన్నపేట: భాజపా బలోపేతానికి నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సూచించారు. దమ్మన్నపేట గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు.

పర్వతగిరి: అన్నదాతల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని భాజపా జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఏనుగల్లు గ్రామంలో బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'నమస్తే' పోర్టల్‌తో కార్మికులకు ప్రయోజనాలు



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ పరిధిలోని మలమూత్ర నిర్వహణ కార్మికులు, సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్ ఆపరేటర్లు 'నమస్తే' పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం బల్దియా సమావేశ మందిరంలో 'నేషనల్ ఆక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఏకో సిస్టమ్(నమస్తే)'పై సెప్టిక్ ట్యాంకు ఆపరేటర్లు, కార్మికులకు అవగాహన కల్పించారు. నమస్తే పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ పథకం ఆరోగ్య కార్డులు పొందవచ్చన్నారు. సిబ్బందికి ఉచితంగా పీపీఈ కిట్లు సైతం అందజేస్తారని అదనపు కమిషనర్ వివరించారు. స్వచ్ఛ వరంగల్ కార్యక్రమంలో భాగంగా ప్రతి మూడేళ్లకోసారి సెప్టిక్ ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజిరెడ్డి, ఆరోగ్యాధికారి డా.రాజేష్, ఆస్కీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

రంగంపేట, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్‌లో పనిచేస్తున్న ఒప్పంద, తాత్కాలిక ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కె.ఏసురత్నం డిమాండ్ చేశారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, టీఎమ్మార్పీఎస్, ఐకాస ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను ఏసురత్నం ప్రారంభించారు. కార్మికులకు రూ.26 వేల జీతం చెల్లించాలని, విధి నిర్వహణలో మృతిచెందిన కార్మిక కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, అంత్యక్రియలకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలపై పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. యూనియన్ నాయకులతో సీఎంహెచ్‌ఓ డా.రాజిరెడ్డి చర్చలు జరిపి, పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్మిక సంఘం నాయకులు ధర్మరాజు, బొట్ల భిక్షపతి, సారంగపాణి, మంద కుమార్, సూర్యం, రఘు, ఏలియా తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం హనుమకొండ ఏకశిలా పార్కు నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలు చెల్లించకపోవడంతో లక్షల మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులు పూర్తిచేసిన చాలామంది విద్యార్థులు ఉన్నత చదువుల కోసం వివిధ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినా.. ప్రైవేటు కళాశాలల్లో ఫీజు బకాయిలు చెల్లించి ధ్రువీకరణ పత్రాలు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు స్టాలిన్, దిడ్డి పార్థసారథి, ల్యాదల్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుపై విచారణ

పర్వతగిరి, న్యూస్‌టుడే: మండలంలోని కల్లెడ గ్రామంలో కెనాల్ కాలువను పూడ్చి ప్లాట్లు చేసి విక్రయించారని ప్రజావాణిలో పలువురు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎల్పీఓ వేదవతి బుధవారం విచారణ చేపట్టారు. ఇళ్ల ప్లాట్లకు సంబంధించిన అనుమతి పత్రాలను పరిశీలించారు. కాలువ భూమికి సంబంధించి నీటిపారుదలశాఖ అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కల్లెడకు చెందిన కొంత మంది విచారణకు వచ్చిన అధికారులను కలిసి తప్పుడు ఫిర్యాదు చేసినట్లు చెప్పి.. వినతిపత్రాన్ని అందజేశారు. విచారణ నివేదికను డీపీఓకు అందించనున్నట్లు డీఎల్పీవో పేర్కొన్నారు. ఆమె వెంట ఎంపీవో పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి మాధవుడు ఉన్నారు.

దీపావళికి కాజీపేట మీదుగా ప్రత్యేక రైళ్లు

కాజీపేట, న్యూస్‌టుడే: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కాజీపేట మీదుగా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాలకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. 07003 నంబరుతో సికింద్రాబాదు- పాట్నా మధ్య ఈ నెల 26, వచ్చేనెల 2, 9వ తేదీలో ఉంటుంది. సికింద్రాబాదులో ఉదయం 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7 గంటలకు పాట్నా చేరుతుంది. 07004 నంబరుతో తిరుగు ప్రయాణంలో పాట్నాలో ఈ నెల 28న, వచ్చేనెల 4, 11వ తేదీల్లో అందుబాటులో ఉంటుంది. మౌలాలి-ముజఫర్‌పూర్ మధ్య 07649 నంబరుతో ఈ నెల 28, వచ్చే నెల 4, 11 వతేదీలలో ఉంటుంది. మౌలాలిలో సాయంత్రం సోమవారం 4.45 గంటలకు బయలుదేరి, బుధవారం ఉదయం 2.30 గంటలకు ముజఫర్‌పూర్ చేరుతుంది. 07650 నంబరుతో తిరుగు ప్రయాణం ఈ నెల 30, వచ్చే నెల 6, 13వ తేదీలలో అందుబాటులో ఉంటుంది. ముజఫర్‌పూర్‌లో బుధవారం ఉదయం 4.50 గంటలకు బయలుదేరి గురువారం సాయంత్రం 7 గంటలకు లింగంపల్లి (తిరుగు ప్రయాణం లింగంపల్లి వరకు) చేరుతుంది.



వ్యాసం రాస్తున్న విద్యార్థులు



బహుమతులు పొందిన విజేతలతో ప్రిన్సిపల్ రాకేశ్, ఉపాధ్యాయులు

వ్యాసం రాశారు.. ప్రతిభ చాటారు

నర్సంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడం కోసం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం 'ఈనాడు-ఈటీవీ తెలంగాణ' ఆధ్వర్యంలో నర్సంపేటలోని శ్రీఅభ్యాస్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 'అంతర్జాల వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. కుసుమ(ప్రథమ), సీహెచ్.మానస్విక(ద్వితీయ), ఎం.శివాని(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ఛైర్మన్ ఎన్.రాజేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.స్వాతి, ప్రిన్సిపల్ రాకేశ్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణ తీరు పరిశీలన

పర్వతగిరి, న్యూస్‌టుడే: విద్యాశాఖ నియమాలను పాటిస్తూ విద్యార్థులకు బోధించాలని పర్వతగిరి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పాక రమేశ్ పేర్కొన్నారు. బుధవారం కల్లెడ ఆర్డీఎఫ్, పర్వతగిరి లయోలా పాఠశాలలను ఆయన సందర్శించారు. సంగ్రహణాత్మక మూల్యాంకన పరీక్షలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

విద్యార్థులకు అభినందన



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వర్ధన్నపేట: కట్ర్యాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ఐ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ శ్రీధర్, పీఈటీ సోమన్న తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు.

సంక్షిప్తంగా

బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు

రాయపర్తి, న్యూస్‌టుడే: మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన వెంకటమ్మ, కొండాపూర్‌లో నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. బాధితులు నిరుపేద కుటుంబాలకు చెందినవారు కావడంతో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసరాలు అందజేశారు. సుధాకర్, యాకయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోండి

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: రైతులు విద్యుత్తు మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్తుశాఖ జిల్లా డీఈటీ ఆనందం సూచించారు. కట్ర్యాల గ్రామ శివారులో బుధవారం రైతులతో 'పొలంబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విద్యుత్తు ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సొంతంగా విద్యుత్తు మరమ్మతులు చేసుకోవద్దని సూచించారు. వర్ధన్నపేట ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చండీయాగం.. అన్నదానం



రామన్నపేట: లోక కల్యాణార్థం శ్రీకాంత్ అడిగ, వంశీకృష్ణ ఆధ్వర్యంలో వరంగల్ పోతనరోడ్ మణిదీప గార్డెన్‌లో బుధవారం మూడోరోజు సహస్ర చండీయాగం కొనసాగింది. పడిశాల సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన లలిత సహస్ర పారాయణంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. కార్పొరేటర్లు చింతాకుల అనిల్, రామ శిరీష, నాయకులు చింతాకుల సునీల్, కుసుమ సతీష్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: వరంగల్ ఎల్బీనగర్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు రూ.2.89 కోట్ల వ్యయంతో బుధవారం సీసీ రోడ్డు పనులు చేపట్టారు. స్థానిక శాంతినగర్ నుంచి అబ్బాస్ వేడుకల మందిరం వరకు జరుగుతున్న పనులను 21వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఫుర్ఖాన్ పర్యవేక్షించారు.

రక్తదానం గొప్ప కార్యం



హంటర్‌రోడ్‌లో కేకు కోస్తున్న మంత్రి సురేఖ

న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం: రక్తదానం గొప్ప కార్యమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి పుట్టినరోజు సందర్భంగా హంటర్‌రోడ్ అన్నపూర్ణ గార్డెన్స్‌లో పెద్దఎత్తున సంబరాలు, మహా రక్తదాన శిబిరం నిర్వహించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులతో కలిసి మంత్రి కేకు కోసి, పావురాలు ఎగురవేశారు. శిబిరం ద్వారా సుమారు 3500 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఆమె వివరించారు. కాంగ్రెస్ నాయకులు నవీన్ రాజ్, ప్రకాష్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- వరంగల్ ప్రాంతం 28వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఆంధ్రాబాలికా పాఠశాలలోని నలుగురు విద్యార్థినులకు నల్గొండ రమేష్, కార్పొరేటర్ గందె కల్పన సైకిళ్లు, విద్యా సామగ్రి అందించారు.
- 34వ డివిజన్ శివనగర్ కార్మికసేవా సంఘంలో కాంగ్రెస్ నాయకుడు పగడాల సతీష్ ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ నాయకుడు నవీన్‌రాజ్ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఖిలావరంగల్ తూర్పుకోటలో 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి పండ్లు అందజేశారు. గిర్మాజీపేటలోని గోవిందాద్రి గోశాలలో శ్రీగోవిందరాజస్వామి ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు.

నర్సంపేట నియోజకవర్గం

జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపిక



రాజేశ్

నల్లబెల్లి, న్యూస్‌టుడే: నల్లబెల్లి గ్రామానికి చెందిన రాయరాకుల రాజేశ్ పౌరశాస్త్ర విభాగంలో జూనియర్ లెక్చరర్ పోస్టుకు ఎంపికయ్యాడు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో మల్టీజోన్‌లో ఏడు పోస్టులకుగాను నాల్గవ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచాడు. గ్రామానికి చెందిన సుగుణ-సాంబయ్య దంపతుల కుమారుడు రాజేశ్ ప్రస్తుతం ఏటూరునాగారంలో పీజీటీ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయునిగా పని చేస్తున్నారు. 2018 సంవత్సరంలో పంచాయతీ కార్యదర్శిగా, టీజీటీ ఉపాధ్యాయునిగా, గ్రేడ్-2 విభాగంలో హాస్టల్ వార్డెన్‌గా, గ్రూపు-4 ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో 14వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం పౌరశాస్త్ర విభాగంలో జూనియర్ అధ్యాపకునిగా ఎంపిక కావడంతో స్థానికులు అభినందనలు తెలిపారు. గ్రూపు-1 మెయిన్స్ పరీక్షలు రాస్తున్నానని, కలెక్టర్ ఉద్యోగం సాధించి, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తానని రాజేశ్ తెలిపారు.

స్వేరోలు ఉన్నతంగా ఎదగాలి

దుగ్గొండి, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగ ఫలాలను అందిపుచ్చుకొని స్వేరోలు ఉన్నతంగా ఎదగాలని ముదిరాజ్ మహాసభ ఎన్నారై విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శివాజీనగర్‌లో ఈ నెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో నిర్వహించనున్న జాతీయ సదస్సు గోడ పత్రికలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మొగిలి, టీజీఏ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందు, నేతలు పాల్గొన్నారు.

నూతన నియామకం

నర్సంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: బీసీ పవర్ నర్సంపేట మండల అధ్యక్షుడిగా మహేశ్వరం గ్రామానికి చెందిన బూస రాజును నియమితులయ్యారు. బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజుయాదవ్ ఉత్తర్వులు అందజేశారు.

ప్రజలకు శుద్ధమైన నీటిని అందించాలి

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో పైపులైన్ లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకొని భగీరథ పథకం ద్వారా ప్రజలకు శుద్ధమైన తాగునీరు సరఫరా చేయాలని వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేందర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మంచినీటి సహాయకులకు శిక్షణ శిబిరంలో సలహాలు, సూచనలు అందించారు. అనంతరం సామగ్రి పంపిణీ చేశారు. డీఈఈ దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీధర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

భాజపాలో బీసీలకు సముచితస్థానం

నర్సంపేట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను విస్మరిస్తుందని, భాజపా సముచిత స్థానం కల్పిస్తుందని భాజపా ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు నందనం అన్నారు. బుధవారం నర్సంపేటలో పార్టీ నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. నేతలు ప్రదీప్, రాము, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని ధర్నా



నెక్కొండ తహసీల్దారు కార్యాలయం ఆవరణలో

నెక్కొండ, న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగులో ఉన్న బోధన ఫీజులు, విద్యార్థుల ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మండల శాఖ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. బుధవారం నెక్కొండ తహసీల్దారు కార్యాలయం ఆవరణలో బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి వినోద్‌కుమార్, ప్రశాంత్, ప్రవీణ్, సిద్ధు, విజేందర్ పాల్గొన్నారు.

స్థలదాతకు పెద్ది దంపతుల సన్మానం



దాత మోహన్‌రావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి-స్వప్న దంపతులు

నర్సంపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రికి భూమిని విరాళంగా ఇచ్చిన దాత దొడ్డా మోహన్‌రావును బుధవారం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి- స్వప్న దంపతులు హైదరాబాద్‌లో కలిసి సత్కరించారు. వైద్య కళాశాల చిత్రపటాన్ని బహూకరించారు.

త్వరలోనే అంతర్గత రహదారుల నిర్మాణం

నర్సంపేట, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు నిరంతరం మంచినీటి సరఫరా చేయడంతో పాటు అంతర్గత రహదారుల పనులు త్వరలో చేపడతామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు. బుధవారం వినియోగదారుల మండలి ప్రతినిధులు యుగంధర్, దామోదర్ హనుమకొండలోని స్వగృహంలో ఎమ్మెల్యేను కలిసి పట్టణ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

విగ్రహాల ప్రతిష్ఠ

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన శివుడు, కాటికాపరి విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించారు. చెన్నారావుపేటకు చెందిన కుసుమ నరేందర్ తల్లిదండ్రులు రాములు- మల్లికాంబ దంపతుల జ్ఞాపకార్థం విగ్రహాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాసంస్థల ఛైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు తడుక అనిల్ ఇటీవల మృతిచెందాడు. నేతాజీ వికలాంగుల పొదుపు సంఘం సభ్యులు మృతుడి సోదరుడు రాజుకు బుధవారం రూ.26 వేల ఆర్థికసాయం అందించారు. సంఘం బాధ్యులు వీరభద్రయ్య, రవికాంత్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఫిర్యాదు పట్టించుకోని పోలీసులు'

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా.. పోలీసులు పట్టించుకోవడం లేదని చెన్నారావుపేట మండలం పాపయ్యపేటకు చెందిన బర్ల పూర్ణచందర్ బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో నర్సంపేటలోని ఓ ప్రైవేటు చిట్‌ఫండ్స్ శాఖలో రూ.10 లక్షల చిట్టీ వేశానన్నారు. రూ.1.50 లక్షలు చెల్లించిన తర్వాత సరిపడా సభ్యులు కాలేదని.. తిరిగి డబ్బులు చెల్లిస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారన్నారు. దీనిపై జనవరి 23, 2023లో నర్సంపేట ఠాణాలో ఫిర్యాదు చేయగా, ఇటీవల ఏసీపీ కిరణ్‌కుమార్ విచారించి సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. అధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని పూర్ణచందర్ కోరారు.

ఓంకార్ వర్ధంతి



రేబల్లెలో..

దుగ్గొండి, న్యూస్‌టుడే: ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఓంకార్ వర్ధంతిని మండలంలోని రేబల్లెలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాష్ట్ర కమిటీ సభ్యుడు బాబురావు పూలమాల వేసి నివాళులర్పించారు. డివిజన్ కార్యదర్శి రాజాసాహెబ్, మండల నేతలు హుస్సేన్, చేరాలు, కొమురయ్య, చందర్‌రావు పాల్గొన్నారు.

నల్లబెల్లి: మాజీ శాసనసభ్యులు, దివంగత మద్దికాయల ఓంకార్ వర్ధంతి కార్యక్రమం నల్లబెల్లిలో బుధవారం నిర్వహించారు. బస్టాండు ఆవరణలో ఓంకార్ చిత్రపటానికి ఎంసీపీఐ(యూ) మండల సహాయ కార్యదర్శి నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యదర్శి సాంబయ్య, రవి పాల్గొన్నారు.

స్పందనకు వందనం

పిచ్చిమొక్కల తొలగింపు

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: లింగాపురం గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలు పెరగడంతో 21న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి అనిత స్పందించి కార్మికులతో బుధవారం పిచ్చిమొక్కలు తొలగించారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతు

చెన్నారావుపేట: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో మంచినీటి పైపులైన్ లీకేజీపై 23న 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి నిట్టు బుధవారం కార్మికులతో పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు.

మిర్చియార్డు ఆకస్మిక తనిఖీ



సంచులు వదిలేసి పారిపోయిన చిల్లర వ్యాపారులు

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ మిర్చి యార్డును బుధవారం కార్యదర్శి నిర్మల ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులో ఎలాంటి అనుమతులు లేకుండా.. రైతుల పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న చిల్లర వ్యాపారులు.. కార్యదర్శిని చూసి అక్కడి నుంచి జారుకున్నారు. ఈక్రమంలో అంతకుముందు కొనుగోలు చేసిన మిర్చి సంచులను అక్కడే వదిలేశారు. వదిలేసిన సంచులను మార్కెట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ ఫీజు చెల్లించిన తర్వాతే సంబంధిత సరకును వదిలిపెట్టాలని కార్యదర్శి అధికారులకు సూచించారు. ఏదైనా సమస్య తలెత్తుతుందని భావించి కార్యదర్శి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేశారు. అయితే మార్కెట్‌లో మిర్చి చిల్లర కొనుగోళ్ల కోసం ప్రతినెలా హమాలీ నాయకులు, యార్డు సిబ్బందికి రూ.5 వేలు చెల్లిస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. మరో వైపు స్వాధీనం చేసుకున్న సరకును వదిలేయాలని కోరుతూ.. యార్డు సూపర్‌వైజర్ బేరసారాలకు దిగడం కొసమెరుపు.

గుట్కా పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: నిషేధిత గుట్కాను పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన ఎండీ ఫజల్ ఇతర ప్రాంతాల నుంచి గుట్కా తీసుకొచ్చి ఇంటి వద్ద పెట్టుకొని విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం టాస్క్‌ఫోర్స్, ఇంతెజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేశారు. రూ.4.82 లక్షల విలువ చేసే గుట్కా పట్టుకొన్నారు. కేసు విచారణ కోసం ఇంతెజార్‌గంజ్ పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్, సిబ్బంది పాల్గొన్నారు.

చంపుతానని బెదిరింపు.. కేసు నమోదు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: క్రిస్టియన్ కాలనీకి చెందిన బాణాల విజయ్‌రావు- కవిత దంపతులను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం.. విజయరావు సోదరి భర్త అంతోని సురేష్ వరకట్నం కోసం భార్యను వేధించడంతో గతంలో అన్నావదినలు విజయ్‌రావు- కవితలతో కలిసి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయం మనసులో పెట్టుకొని సురేష్ ఈ నెల 7న కవితతో పాటు ఆమె భర్త విజయ్‌రావును చంపుతానంటూ బెదిరించాడు. దీంతో బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరస్పర దాడిలో ఇరువర్గాలపై..

రంగశాయిపేట, కరీమాబాద్, న్యూస్‌టుడే: సాకరాసికుంట ప్రాంతంలో మంగళవారం రాత్రి ఇరువర్గాల పరస్పర దాడి ఘటనపై మిల్స్‌కాలనీ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన చివరిరోజు వన భోజనాలకు వెళ్లారు. ఈక్రమంలో మద్యంతాగిన యువకులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణ పడ్డారు. మాటామాట పెరిగి బీరు సీసాలతో దాడి చేసుకున్నారు. తల్వార్ తిప్పుతూ హల్‌చల్ చేశారు. పరస్పర దాడుల్లో ఇరువర్గాల వారు గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసినట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు.

గృహిణి అదృశ్యం..

రంగశాయిపేట, న్యూస్‌టుడే: రంగశాయిపేట ప్రాంతానికి చెందిన గృహిణి అదృశ్యమైంది. మిల్స్‌కాలనీ సీఐ వెంకటరత్నం కథనం ప్రకారం.. ఈ నెల 21న రాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా రూ.3 లక్షల నగదు, 10 తులాల బంగారం తీసుకొని వెళ్లిపోయిందని భర్త బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇద్దరు కుమార్తెలున్న ఆమె అదృశ్యంపై స్థానికంగా నివసిస్తున్న కానిస్టేబుల్ మీద అనుమానం ఉన్నట్లు పోలీసులకు వివరించారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి బుధవారం రెండో తరగతి న్యాయమూర్తి వీరస్వామి రూ.27,400 విధించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. చోదక అనుమతి లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ముగ్గురికి రూ.2500 జరిమానా విధించారన్నారు.